కథ

# రాయి చరిత్ర

కొల్లూరి సోమశంకర్

ఓ మామూలు సంఘటన తర్వాతే ఇదంతా జరిగింది. సాధారణ ఘటనలే ఎన్నో చారిత్రక ఘట్టాలకు దారితీస్తాయని అందరికీ తెలిసినదే.

సూర్యుడు ఉదయిస్తాడు అస్తమిస్తాడు ఆంథోని. కరుణన్ ఇద్దరూ నిద్ర లేస్తారు. పనికి వెడతారు. సాయంకాలానికి తిరిగొస్తారు పట్టంకోడ్ అనే అందమైన ఆ గ్రామంలో జీవితం ప్రశాంతంగా ఉంటూ తాపీగా సాగిపోతున్న రోజులవి!

కరుణన్, ఆంథోనీల జీవితాలు పాటలాగ సాగుతుండగా, వారి జీవితాలలో ఓ రాయి ఎదురైంది. ఇక్కడ రాయి ఎదురవడమంటే...రాయి కనబడడమన్నమాట. అది చూడడానికి ఏదో శిల్పం నుంచి విరిగిన ముక్కలా ఉంది. దాన్ని మొదటగా ఆంథోని చూసాడు.

ఆ రోజు పొద్దున్నే ఆంథోని తన భార్య శారా ఇచ్చిన బ్లాక్ కాఫీ తాగి నడకకి బయల్దేరాడు... రాత్రి ఎక్కించుకున్న మత్తుని వదిలించుకోవడానికి. తన ఇంటి నుంచి మెయిన్ రోడ్‌ని కలిపే సందు చివర అతని కాలికేదో తగిలింది. నొప్పిగా అనిపించి నేల వైపు చూసాడు. సుమారుగా ఆరు అంగుళాలు పొడవున్న గుండ్రటి రాయి అది. తన కాలితో దాన్ని పక్కకి లాగాలని చూసాడు. కాని అది ఓ పట్టాన కదలలేదు. చాలా బరువుగా అనిపించింది. దాన్నో సవాలుగా తీసుకుని చేత్తో పైకి లేపి పక్కనున్న పొదల్లో వడేసాడు. అది ఎక్కడ వడిందో పట్టించుకోలేదు.

ఆంథోని, కరుణన్ బాల్యమిత్రులు. చిన్నప్పుడు కలిసి ఆడుకున్నారు. పెద్దయ్యాక ఇరుగుపొరుగునే ఉంటున్నారు. అంతకు మించి అత్యంత ఆప్తులయ్యారు చిన్న తనం నుంచి అల్లరి పనులలో అంటే మామిడి చెట్టుపై రాళ్ళు విసరడం. గోడలు దూకడం వంటి పనులలో ఇద్దరూ భాగస్వాములు. ఆంథోని ఐదో క్లాసు దాటలేక పోయాడు. కరుణన్ సంగతి వేరే చెప్పాలా?

వాళ్ళిదరూ చదువు మానేయాలని నిశ్చయించుకున్నా వాళ్ళ నాన్నలు వారిని వదల్లేదు. ఆంథోనీ, కరుణన్ మొండిపట్టు పట్టారు. ఇంకా చదవడం వలన ఏమీ ఉపయోగం లేదని వారి భావన. మన ఎదురింటి సన్నీని చూడండి. డిగ్రీ పాసయి. ఉద్యోగం దొరక్క ఖాళీగా ఉంటున్నాడు. అలాంటప్పుడు చదువుకోడం కన్నా, ఏదైనా పని చేసుకుని పొట్టపోసుకోడం ఉత్తమం.

వారి నిర్ణయాన్ని ఎవరూ మార్చలేకపోయారు. ఇప్పుడు వారిద్దరూ శారీరక శ్రమ చక్కగా చేయగల పనిమంతులు. రోజుకి దాదాపు యాభై రూపాయలు సంపాదిస్తారు. వాళ్ళు ఏ పని చేయడానికైనా సిద్ధం. గోతులు తవ్వడానికి, కర్రలు కొట్టడానికి, పొలంలో నాట్లు వేయడానికి లేదా కోతలు కోయడానికి... దేనికైనా వాళ్ళిదరూ వెనుకాడరు. వాళ్ళు చేయలేని పని దాదాపుగా లేదనే చెప్పాలి.

కరుణన్ 'థంకం' ని ఆంథోని 'శారా'ని పెళ్ళి చేసుకున్నారు. వాళ్ళకి చెరో ఇద్దరేసి పిల్లలు.

పనిలో ఉన్నప్పుడు ఇద్దరూ కొంతసేపు మాట్లాడుకుంటారు. సాయంత్రం పనులు ముగిసాక. కల్లు కాంపౌండ్‌కి వెళ్ళి కొబ్బరి కల్లు తాగుతారు.

ఈ దశలోనే వాళ్ళ జీవితాలలోకి ఆ రాయి ప్రవేశించింది. ఆంథోని విసిరేసిన ఆ రాయికేమయిందో, అదిప్పుడు ఎక్కడుందో తెలుసుకోవడం కష్టం.

ఎప్పటిలానే ఆంథోని కరుణన్ ఇంటికి వెళ్ళాడు. అక్కడి నుంచి ఇద్దరూ కలసి పనికి బయల్దేరారు దారిలో ఆంథోని..." చూడు కరుణా, పొద్దున్న నా కాలికి ఓ రాయి తగిలింది. బాగా నొప్పొస్తోంది.." అంటూ రాయి తగిలిన ఎడమ పాదపు బొటనవేలిని చూపాడు. ఆ రాయిని పడేసిన విధానం గురించి చెప్పాడు. తర్వాత వాళ్ళిదరూ ఏవో కబుర్లు చెప్పుకుంటూ నడిచారు. ఆ సాయంత్రం కల్లు కాంపౌండ్ వద్ద కలవడం మరిచిపోలేదిద్దరూ.

మర్నాడు ఆదివారం. ఆ రోజు వాళ్ళిద్దరూ పనిచేయరు. ఆంథోనీ చర్చికి వెడతాడు. మిత్రులిద్దరూ విడివిడిగా ఉండేది బహుశా ఆ ఒక్క రోజేనేమో.

సోమవారం పొద్దున్నే ఆంథోని పనికి బయల్దేరుతుండగా నలుగురైదుగురు వ్యక్తులను తీసుకుని కరుణన్ ఆంథోనీ ఇంటికి వచ్చాడు. ఆంథోనీని పక్కకి తీసుకెళ్ళి లోగొంతుకతో..." వీళ్ళంతా ఈ ప్రాంతంలోని పెద్దమనుషులు...." చెప్పుకొచ్చాడు కరుణన్. మళ్ళీ తనే మాట్లాడుతూ..." క్రిందటి వారం మర్రి చెట్టు క్రింద ఉండే శివలింగాన్ని ఎవరో ఎత్తు కెళ్ళారట వీళ్ళు ఇంటింటికి తిరిగి భోగట్టా చేస్తున్నారు నీ కాలికి ఏదో రాయి తగిలిందన్నావుగా, దాని గురించి వీళ్ళకి చెప్పాను. దాన్ని ఎక్కడ పడేసావు? అది శివలింగమో కాదో పరీక్షిస్తారట...!" అని చెప్పాడు.

"కాదు, అది శివలింగం కానేకాదు, ఓ మామూలు రాయి. అంతే గుండ్రంగా, సుమారుగా ఆరు అంగుళాల పొడవుంది..." అన్నాడు ఆంథోని నిర్లక్ష్యంగా.

కరుణన్ ఆంథోనీని అక్కడున్న వ్యక్తుల వద్దకి తీసుకెళ్ళాడు.

"చూడండి. అది శివలింగం కాదు, ఓ చిన్న రాయి మాత్రమే. వీడు దాన్ని ఆ పల్లంలోకి విసిరేసాడట" అంటూ చేత్తో తూర్పు వైపు చూపిస్తూ వాళ్ళతో చెప్పాడు కరుణన్.

ఆ వ్యక్తులలో ఒకరు నోరు విప్పాడు.

"నిజమే. అది రాయే. మేము అర్థం చేసుకోగలం.

కాని దాన్ని మేమొకసారి చూడాలనుకుంటున్నాం. ఇది చాలా గంభీరమైన అంశం...." అని అన్నాడు.

"ఎలా చూస్తారు అది ఆ పల్లంలో ఎక్కడో పొదల్లో పడిపోయిందే..." అన్నాడు ఆంథోనీ. ఇంకో వ్యక్తి జోక్యం చేసుకున్నాడు.

"నీకది రాయి మాత్రమే కావచ్చు. కాని మాకు ఓ పవిత్రమైన విశ్వాసం" అంటూ ఓ క్షణం ఆపి, "అదే మీ శిలువ అనుకో, దాన్ని ఎవరైనా ఎత్తు కెడితే...?" అన్నాడు.

"పిచ్చి పిచ్చిగా మాట్లాడద్దు" అన్నాడు కరుణన్ కటువుగా. "అది శివలింగం అయ్యుండదు. కేవలం నాకేదో సందేహం వచ్చి మీతో చెప్పానంతే. మీకింకా అనుమానం ఉంటే వెళ్ళి ఆ పొదల్లో వెదుక్కోండి..."

"అదీ నిజమే. వెళ్ళి వెదుకుదాం పదండి" అన్నాడింకో వ్యక్తి.

"ఇప్పటికి వెదుతున్నాం ఆంథోని, కానీ ఏ ఆధారం దొరక్కపోతే మాత్రం మేము మళ్ళీ వస్తాం..." అన్నాడు ఇంకో వ్యక్తి. అతని మాటల్లో బెదిరింపు ధోరణి వ్యక్తమైంది.

కొన్ని క్షణాల తర్వాత వాళ్లందరూ వెళ్ళిపోయారు. శారా, పిల్లలు వరండాలో నిలబడి జరిగినదంతా చూసారు. భయభీతులైన వాళ్ళ ముఖాలను చూస్తూ.... "వదినా, మీరేం కంగారు పడకండి. ఆ రాయి ఇక్కడే ఎక్కడో పడుంటుంది. వాళ్ళకది దొరికితే, అంతా సర్దుకుంటుంది" అన్నాడు కరుణన్. శారా మనసు తేలిక పడింది. ఆంథోని భార్యకి, పిల్లలకి వీడ్కోలు పలికి, కరుణన్‌తో కలిసి పనికి బయల్దేరాడు

రెండు రోజులు గడిచాయి. మూడో రోజు పొద్దున్నే ఏవో కేకలు వినిపించి ఆంథోనీకి మెలకువొచ్చింది. పక్క మీద నుంచి లేచి కిటికీలోంచి ఈ హడావుడికి నిద్రలేచిన శారా భర్తని లోపలే ఉండమని బ్రతిమాలింది. తనకి ధైర్యం చెప్పి ఆంథోనీ బయటికి వచ్చాడు.

వచ్చిన జనాలందరూ వరండాలోను, ఇంటి తోటలోను నిలబడ్డారు వాళ్ళకి నాయకుడిలా ఉన్న వ్యక్తి ముందుకొచ్చి... హెచ్చు స్వరంతో...

"నువ్విచ్చిన సమాచారం మేరకు మేము అన్ని చోట్లా వెతికాం. ఎక్కడా కనబడలేదు. మా శివలింగం మాకు కావాలి. అదెక్కడుందో నీకు తెలుసు... మర్యాదగా చెప్పేయ్..." అని అన్నాడు.

ఈ పరిస్థితి చాలా ఇబ్బందిగా అనిపించింది ఆంథోనీకి. వాళ్లందరికి వాస్తవం మరోసారి వివరించి చెప్పాలనుకున్నాడు.

"చూడండి. ఆ రాయి గురించి నాకేం తెలియదు. ఇలా జరుగుతుందని తెలిస్తే నేను దాన్ని జాగ్రత్తగా భద్రపరిచేవాడిని..." అన్నాడు బ్రతిమాలుతున్న ధోరణిలో. ఓ క్షణం పాటు మౌనంగా ఉండి ఎవరి కోసమో గుంపుని పరీక్షగా చూసాడు. కాని కరుణన్ ఎక్కడా కనిపించలేదు. ఆంథోనీకి ఆందోళన అధికమైంది.

గుంపులోంచి ఓ వ్యక్తి ముందుకొచ్చాడు.

"మా శివలింగాన్ని ఆఖరిసారిగా చూసింది నువ్వే. అది ఋజువైంది కూడా. అది దొరికితేనే మేమిక్కడినుంచి కదిలేది..." అని అన్నాడు.

ఏదో ఆటవిక శక్తి గుంపుని ఆవహించడం ఆంథోని గమనించాడు. వణుకుతున్న గొంతుతో..." మీరు నన్నెందుకు సతాయిస్తున్నారు. నేనే పాపం ఎరుగను" అన్నాడు. కళ్ళనీళ్ళ పర్యంతమయ్యాడు. సరిగ్గా అప్పుడే గుంపులోంచి మరో వ్యక్తి ముందుకొచ్చి. ఆంథోని ముఖంపై లాగి పెట్టికొట్టాడు. "నీకే పాపము తెలియదా! నువ్వు అమాయకుడివా? మేమిక్కడే పుట్టాం. ఈ ప్రాంతం మాది. ఈ భూమిలో శతాబ్దాల పాటు ఒకే ఒక మతం ఉండేది. నువ్వు, మీ వాళ్ళు మా మీద ఎప్పటికీ పెత్తనం చలాయించలేరు. అటువంటి ప్రయత్నాన్ని సైతం మేము సహించం..." అంటూ గట్టిగా రంకెలు వేసాడు. ఓ క్షణం ఆగి.... "నీకిదే ఆఖరి అవకాశం. రేపు ఉదయానికి మాకు మా శివలింగం కావాలి. లేకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి..." అని కటువుగా హెచ్చరించాడు.

"అవును...తీవ్ర పరిణామాలుంటాయి..." అంటూ గుంపులోని జనాలు అరిచారు. ఉద్రేకపు ప్రకంపన గుంపులో చాలా సేపు కొనసాగింది. అది కాస్త తగ్గిన తర్వాత, వాళ్ళ నాయకుడు..." ఈ పూటకి వెదదాం పదండి" అంటూ వాళ్ళందరితో సహా అక్కడ్నించి కదిలాడు. నినాదాలు చేసుకుంటూ గుంపు వెనక్కి మళ్ళింది. ఆంథోని అక్కడే, నేల మీద కూలబడ్డాడు. భారమైన హృదయంతో గుంపు వెళ్ళినవైపే చూస్తుండిపోయాడు. ఈ గొడవనంతా లోపల్నించి నిస్సహాయంగా చూస్తున్న కుటుంబ సభ్యులను ఓదార్చడానికి లోపలికి నడిచాడు.

ఈ సంఘటన తర్వాత ఆంథోనీ కరుణన్‌లు తమ మిగతా జీవితాలని ఎలా గడిపారో మనకి తెలియదు. ఆ తర్వాత ఏం జరిగిందనేది ఆ గ్రామం చరిత్రలో నిక్షిప్తమైంది. ఆ చారిత్రక దస్తావేజులోని వాక్యాలను యథాతథంగా... ఇక్కడ రాస్తే....

"6 డిసెంబరు 1992 నాడు పట్టంకోడ్ గ్రామంలో ఇరువర్గాల మధ్య దారుణమైన ఘర్షణలు చెలరేగాయి. వందలాది మంది చనిపోయారు. ఎన్నో ఇళ్ళు తగలబడ్డయి..."

అందులోదే మరో పేరాగ్రాఫ్" కొంతమంది జనాలు శివలింగం గుర్తు ఉన్న జండాలు పట్టుకోగా మరికొందరు శిలువ గుర్తున్న జండాలు ధరించారు. ఆదిమ మానవుడు పాత రాతియుగంలో రాళ్ళని ఆయుధంగా వాడాడు. పట్టంకోడ్ ఘర్షణల విశేషమేంటంటే... ఈ ఊర్లో ఇరవయ్యో శతాబ్దంలో కూడా మనుష్యులు ఓ రాయి కోసం పరస్పరం కొట్టుకుచచ్చారు..."

ఆంథోనీ కరుణన్‌లు ఏమయ్యారో మనకి తెలియదు. చరిత్ర పుస్తకాలలో వాళ్ళ ప్రస్తావనే లేదు. అల్లర్లు వాళ్ళిద్దరిని చెరోవర్గం వైపు చేరేలా ప్రేరేపించాయేమో? వాళ్ళిద్దరూ ఒకరినొకరు ఎదుర్కొని తన్నుకు చచ్చారేమో? తెలియదు.

ఓ రాయి పై దృష్టి కేంద్రీకరించిన చారిత్రక పత్రంలో బహుశా మనుష్యులకు అంత ప్రాధాన్యత లేదేమో॥



మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో జరిగిన సభలో 'నటులు...జాతకయోగాలు' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న సుప్రసిద్ధ జ్యోతిష్యపండితులు డాక్టర్ సి.వి.బి.సుబ్రహ్మణ్యం. చిత్రంలో మానసరఘుశ్రీ, గ్రంథరచయిత్రి డా॥ఈడ్పుగంటి పద్మజారాణి, శ్రీమతి ఎం.వాసంతి ఉన్నారు.